వివాహ మంగళం

రాత్రి తొమ్మిదవుతుంది. గృహలక్ష్మి వంటిల్లు సర్దుకుంటోంది. గిన్నెలు, చెంబులు చప్పుడుతోపాటు వరవిక్రయం, వందేమాతరం పాటముక్కలు పలికిన గ్రామఫోన్ ప్లేటు ముక్కల సంగీతంలా వినబడుతున్నాయి.

వేసంకాలం. ఆకుఅల్లాడ్డం లేదు. కుర్చీ, టేబులూ, కాగితాలు పెట్టుకొని వీధిలో కూచున్నాను, ఏదో రాద్దామని.

"ఇదిగో... ఇందాకా మీతో చెప్పడం మరచిపోయాను. సాయంత్రం మీకోసం మా మామయ్య వచ్చాడు. అతని కొడుకు ప్రకాశానికి పేటలో ఎల్లుంటి పెళ్ళిట. తప్పకుండా రావాలని మరీ మరీ చెప్పి వెళ్లాడు".

చట్టున తలెత్తి చూశాను. నుదుటి మీద చెమటలో తడిసి అంటుకున్న తల వెంట్రుకలను సవరించి, కట్టుకున్న పాతగళ్ల చీర చెంగుతో చేతులు తుడుచుకుంటూ మా ఆవిడ సాక్షాత్కరించింది.

"అట్లానా - చాలా బాగుంది. ఇన్నాళ్లూ నీ పెట్టె చెరలో దుఃఖించే వెండి చెంబులికీ, సిల్కుచీరలకీ మంచి విడుదల. పోనీ పాపం - ఈవిధంగానైనా రెండుమూడు రోజులు వెలుగు చూస్తాయి."

"మీరుందురూ - నిత్యమల్లెపువ్వులా నిగనిగలాడుతూ - మీ ఆక్షేపణలకేంగాని, ప్రయాణం మాట ఏమిటి?'

పిల్లలికి మరో నాలుగు చొక్కాలు - నాకో రెండు చీరలూ, ఒక సబ్బుబిళ్ల పెట్టీ, చిన్నపిల్లాడికి ఒక బూడ్సుల జతా..."

జాబితా అట్లా పెరిగిపోతోంది. నేనందుకున్నాను. "నా కమీజులకు మరో కప్పుల జత - ఒక షేవింగు సెట్టూ, రెండు సిగరెట్ టిన్నులూ, ఒక అమాందస్తా..."

ఇద్దరం నవ్వేశాం.

"అమాందస్తా ఎందుకూ" నవ్వుతూనే కోపంగా అంది.

"పెళ్లివారికి పనికొస్తుంది" ధీమాగా అన్నాను.

"మీరంతకన్నా ఎక్కువ బహుమతులిస్తారనుకోలేదు".

"పాత్రదానం"

గిరుక్కున తిరిగివెళ్లిపోతోంది, ఇంట్లోకి.

రసశాస్త్ర ప్రకారం అది సరసమో, విరసమో, చెప్పజాలనుగాని, ఆవిడతో అట్లా పేచీ పెట్టుకోవడం, పుల్లవిరుపు మాటలనడం నాకో 'రిలీఫ్'. నెమ్మదిగా లాలించి వెనక్కి పిలిచాను.

"నవ్వులాలకన్నదీ నిజంగా అన్నదీ గ్రహించక, అట్లా చిందులు తొక్కుతావేం? ఇలారా... తప్పకుండా వెడదాం, రేపు మధ్యాహ్నం రైలుకు. రేపు బజారుకి వెళ్లేటప్పుడు ఏమేం కావాలో చెప్పు... అయితే పెళ్లి ఎన్నాళ్లు!"

పాపం! అల్పసంతోషి! ప్రియంగా ఒక్కమాట ఆడితే చాలు, 'సీదా' చల్లబడిపోతుంది.

"అయిదు రోజులు చేస్తారట. అవతలివారు చాలా భారీ మనుషులు. ముద్దుముచ్చట్లు బాగా తీరుస్తారు'.

చాప దగ్గిరగా లాక్కుని తృప్తిగా కూచుంది.

పాపం! ఈ ఆడవాళ్లకి పెళ్లికి వెళ్లడమంటే ఎంత సరదా! ఈ మురికి గుడ్డల్లోంచి - అంటతప్పాలాల్లోంచి, విసుగెత్తే రోజు వారీ బతుకులోంచి కొత్తలోకంలోకి వెళ్లినట్టుం టుందిగావును - హిస్టీరియావాళ్లూ, కడుపునొప్పివాళ్లూ, ఎప్పుడూ ధుమధుమలాడే వాళ్లూ, ఇట్టే మారిపోతారు పెళ్లిళ్లలో.

శుభ్రమైన బట్టలు. సెంట్లు - కళకళలాడుతూ ఉత్సాహంతో గంతులేస్తూ కనపడతారు. ఔనుపాపం! వాళ్లకి క్లబ్బులా, సభలా, స్నేహితులా, షికార్లా? - దరిద్రగొట్టు వంటిల్లు, రోగిష్ఠి పిల్లలు, కసురుకొనే మొగుడు - ఎంత నరకం అనుభవిస్తున్నారు - తెనుగు కుటుంబాల ఆడవాళ్లు!

పెళ్లికి వెళ్లడమంటే నాకూ నిజంగా ప్రాణం లేచివచ్చింది. ఈమధ్య సజీవమైన - రసవంతమైన పెళ్లే చూడలేదు. తిరుపతి మొక్కుబడికి వెళ్లినట్టు యానాంవెళ్లి తిండికి మొహంవాచి యెకాయెకి బళ్లల్లో నలిగిచచ్చి - ఛా - ఏం పెళ్లిళ్లు! నిజంగా తెనుగు కుటుంబాల పెళ్లి మాధుర్యమే చచ్చింది. ఈ కక్కుర్తి కల్యాణాలు! చిన్నప్పుడు చూచిన పెళ్లిళ్లు తలచుకుంటే ఒళ్లు పులకరిస్తుంది.

పెళ్లి పందిట్లో అడుగు పెట్టేసరికి చల్లని కొత్త తాటాకుల వాసన, ఇంట్లో అడుగు

పెడితే వడివడిగా తిరిగే శృంగారవతుల జడలలోని మరువం వాసన - నట్టింట్లో తివాసీల మీద పిల్లలు ఒలకపోసిన పన్నీటి మంచిగంధం వాసన - పెరట్లో గాడిపొయ్యి దగ్గర కొత్తచాపల మీద రాసులుగా గుమ్మరించిన ఉడికిన కూరగాయల వాసన - కళాయిలో పడుచు హృదయంలోని ప్రేమలా తెగమరిగే తియ్యని సంతర్పణ పులుసు వాసన - మొత్తంమీద పెళ్లే ఎంత సువాసన!

పందిట్లో శుభప్రదమైన ఆ సన్నని సన్నాయి పాట - కొత్తచీరల కనకనలతో, మెడ గందపూతలతో - కొత్తగా కాపరానికి వెళ్లివచ్చిన మరదళ్ల, మేనగోడళ్ల హాస్యాలు - ఏవీ ఇప్పుడు? అంతా పూర్వవాసన అయిపోయింది. వేదులకవి పద్యం జ్ఞాపకం ఒచ్చింది.

"అలరునకుబోలె నా హృదయమ్మునకును
జన్మమునకొక్కటే వికాసమ్ము చెలియ!"

వెనువెంటనే నా పెళ్లి సంగతులు కళ్లల్లో స్ఫురణగా తిరిగాయి.

ఎప్పటిమాట! సుమారు పదేళ్లవుతుంది.

2

తొట్టిలో పిల్లవాడు కదిలి ఏడవడంతో నా భావనాచక్రం ఆగింది. చాపమీద కునికి పాట్లు పడుతూన్న మా ఆవిడ ఉలికిపడి లేచి చంటిపిల్లాడి దగ్గరికి వెడుతూ "ఏమిటలాగే కూచున్నారు? దీపం కాగడాలా వెలుగుతోంది. కాగితాలు ఎగిరిపోతున్నాయి. ఇదేనా రాత? లేవండి, రేపు రాసుకుందురుగాని..." అని నవ్వి వెళ్లిపోయింది. ఉదయం కళ్లు నులుపుకుంటూ నేను పక్కమీదనుంచి లేచేసరికి, మా ఆవిడ చేసే కంజాయింపు బహు కట్టుదిట్టంగా వినబడుతోంది. పిల్లలికి ఒంటిమీద నీళ్ళుపోసి, తలలు దువ్వి, చొక్కాలు తొడిగి, పువ్వుల్లా తయారుచేసింది. తుడిచిన గదులూ, మడిచిన బట్టలూ, నిన్నటికన్న అతి పొందికగా కనబడుతున్నాయి. కాకులు కుయ్యకుండానే తియ్యని పొగలు కక్కే కాఫీ సిద్ధమయిపోయింది. ఇక - శుద్ధాంతంలో అడుగుపెట్టేసరికి - శుభ్రమైన ఉప్పాడ చీర, ఊదాసిల్కు జాకెట్, తలనిండా పువ్వులు, ఉదయ సూర్యుడంత కుంఖంబొట్టుతో మా ఆవిడ కాఫీ గ్లాసు పట్టుకొని ఎదురొస్తోంది. అప్పుడు స్ఫురించింది. ఓహో - ఈవేళ మంగళవారం, పేట పెళ్ళికి వెళ్ళాలి. మధ్యాహ్నం మూడు గంటల రైలు ప్రయణానికి ఉదయం 6 గంటల నుంచి సన్నాహం. బహుదూరదృష్టి మనిషి మా ఆవిడ.

ఆఫీసుకు వెళ్లి అధికారి వేసిన యక్షప్రశ్నలకు జవాబు చెప్పుకొని హిందూ దేశానికి స్వరాజ్యం తెచ్చినట్టుగా నాలుగు రోజులు సెలవుసంపాదించాను. మా మీద పగకొద్దీ రైలు ముందే వచ్చి రహస్యంగా వెళ్లిపోతుందేమో అని పదింటికే భోజనాలు చేసేశాం.

ఎంతకీ మూడు కావడం లేదు. మా ఆవిణ్ణి పిల్లల్ని పట్టశక్యం కాకుండా వుంది. వాళ్లను 'ఎంగేజ్' చేసే మార్గం కనబడ్డం లేదు. పరుపుకట్టడం ఏడిసినట్టుందనీ, ట్రంకుపెట్టిలోంచి బట్టలు తొంగి చూస్తున్నాయనీ, సూట్‌కేస్ తాళం కనపట్టం లేదని, మూడు గంటల దాకా నోటితో పనిచేసి ఎట్టకేలకు ఒక వేణ్ణీళ్ల ధెర్మోఫ్లాస్క్, చన్నీళ్ల మరచెంబూ, రెండు పెట్టెలూ, నాలుగు పరుపు చుట్టలూ, వగైరాలతో శృంగేరీ శంకరాచార్య పీఠంలా బయలు దేరి సకాలానికి రైల్లోపడి సాయంత్రం అయిదు గంటలకు పేట చేరుకున్నాం.

3

మొగపెళ్లివారు ఉదయమే సదరు గ్రామం దయచేసి స్నాతకం వగైరా చేసుకుని విశాలమైన విడిది మేడలో 'కాంపు' ఖణాయించారు. పదిహేను, ఇరవై మధ్య వయస్సు గల కుర్రజాతి పేక టపాటపా కలిపి పంచుకుంటూ గోలచేస్తోంది, ఒక అరుగుమీద చేరి. వృద్ధులు – భోజనాలు పొద్దుపోయాయి గావును – మేడకింద హాల్లో ఇంకా దొర్లు తూనే వున్నారు. మేం గుమ్మంలో అడుగుపెట్టేసరికి "అరుగో – శర్మా, సత్యవతీ, పిల్లలూ వచ్చా"రని పెళ్లిపెద్దలు, ఆడవారూ, మగవారూ కూడా మాకు స్వాగతం పలికి "మీకు బస, మేడమీద ఏర్పాటు చేశాం. పైకి పదం"దన్నారు.

సామాను పట్టించుకుని సరాసరి మేడపైకి వెళ్లి ఒక శుభ్రమైన గదిలో సర్దించాను. తిరిగి చూస్తే మా ఆవిడ 'పతా'లేదు. పోలీసు చేతుల్లోంచి తప్పించుకు పారిపోయిన జన్మఖైదీలా స్వజనంలోకలిసిపోయింది. మళ్లా ఇంతట్లో పట్టుకోవాలంటే బోలెడంత సిబ్బంది కావాలి.

రైలు ప్రయాణంలో ఒళ్లంతా నలగ్గొట్టినట్టుంది. దక్షిణం వైపు కిటికీలోంచి గాలి రివ్వున విసురుతోంది. బెడ్డింగు విప్పి కాస్త నడుం వాల్చాను. అనతిదూరంలో వున్న పెళ్లి వారి పందిట్లోంచి శ్రావ్యమైన సన్నాయి 'మరుగేలరా ఓ రాఘవా' పాడుతోంది. చిన్న కునుకు పడుతోంది. గదిలోకి ఇంకో సామాను వస్తున్న చప్పుడు. కళ్లు విప్పి చూశాను. సామాను వెనక ఒక ఆయన వచ్చాడు. వయసు 'చత్వారింశత్' దాటి వుంటుందని నిశ్చయం. కళ్ళకు ఖరీదైన కొత్తరకం ఫ్రేము కళ్ళజోడు. క్లోజ్డు కాలరు కోటు, దానిమీద సన్నని బంగారపు వాచీగొలుసు మెరుస్తూ వేలాడుతోంది. గుమ్మటం లాంటి శరీరం. కుంఖం బొట్టు. తిలతండుల న్యాయం తల. చూపుల్లో సౌజన్యం కంటె అధికారం ఏలు బడి చేస్తోంది. మీసాలు లేవు. నాకు ఎదురుగా వుండే గోడవైపు ఎక్కడ ఏ సామాను సర్దవలసిందీ వెండికట్టు బెత్తం మొనతో చెబుతున్నాడు. అయిదు నిమిషాల వ్యత్యాసంలో ఆయన వెంటనే ఒక ఇరవైయేళ్ళ చక్కని అమ్మాయి కాలి ముఖమల్ జోడు నెమ్మదిగా

చప్పుడు చేసుకుంటూ లోపలికి వచ్చింది. కణ్వమహర్షి వెనకాల వచ్చిన శకుంతలలా వుంది. ఉపమానం తప్పేమో - వైట్‌రోజ్ తలనూనె వాసనతో గూడా ఆమె జడలోని దవనం వాసన గుప్పున కొట్టింది. చప్పున తల ఎత్తి చూశాను. కనకాంబ్రం రంగు సిల్కుచీర కట్టుకుని, ఇంగ్లీషు రంగు జార్జెట్ జాకెట్ తొడుక్కుంది. లేత సూర్యకిరణాలు మామిడి చిగురు మీద పడి వెలిగే వింతరంగు ఆమె శరీరానిది. ఆ కళ్లెత్తి చూస్తే అక్కడ ఇంద్రధనస్సులు పండుతాయి.

మల్లిపువ్వులూ, మామిడిపండ్లూ, వేసి తెచ్చిన ఖద్దరు చేతిసంచీ, సామాను పక్కన పెట్టి గది నాలుగు వైపులా చూసింది ఎందుకో -

ఆయన కోటు వగైరాలు విప్పి రెండు తువాళ్ళు తీసి ఒకటి కట్టుకుని ఒకటి పైనవేసుకుని సబ్బుపెట్టె పట్టుకొని వెడుతూ "రమణయ్యగారు ఇంకా రాలేదా" అన్నాడు ఉచ్చైః స్వరంగా. ఏదో ఆలోచిస్తున్నాను. 'నిన్నే. మాట్లాడవేం' అన్నట్టు నావైపు చూశారు. ఆయనకు గవర్నమెంటులో ఏదైనా ఉద్యోగమేమో -

నేను లేచి కూచ్చుని భయభక్తులు తెచ్చుకుని అన్నాను. "చిత్తం. తెలియదండి. మీకుగాని... కనపడితే... కాస్త ... దయచేసి నేనుగూడా వచ్చానని వారితో చెప్పండి...."

పుష్కరం ఈమధ్య ఆ రవణయ్యగారెవరో నేనెరగను. నా మాటలోని కొంటెతనం ఆవిడ గ్రహించిందిగాబోలు ఒకసారి నన్ను వింతగా చూసి నవ్వాపుకుంది. ఆయన స్నానానికి, ఆవిడ మేడకిందకీ వెళ్ళారు.

చీకటిపడుతోంది. మొగపెళ్ళివారి తాలూకువారు తండతండాలుగా మేడంతా ఆక్రమించారు. మా గదికూడా మరికొన్ని ముఠాలతో నిండిపోవలసిందేగాని వారిదీ, మాదీ కలసి సామాను నాలుగు కుటుంబాలకు సరిపడా వుంది - కనక మరి ఎవరూ ఇందులో చొరబడలేదు - కొంచెం చల్లగాలిలో తిరిగి రావచ్చుగదా అని ఊరి చివరికి వెళ్ళి అటూఇటూ తిరిగి సుమారు ఎనిమిది గంటలకు విడిది చేరుకున్నాను.

మా ఆవిడా, ఆ కొత్తమ్మాయీ లోకాభిరామాయణం అందుకున్నారు. ఎంతో కలుపుగోలుతనంగా ఆ అమ్మాయి మా పరుపులకు జేరబడి పకపక నవ్వుతూ మాటాడుతోంది.

సుముహూర్తం పదింటికేట. ఈలోపున ఊరేగింపు కూడా అయిపోవాలి. చప్పున భోజనాలు పూర్తిచేసుకు చక్కా వచ్చాం.

ఊరేగింపు నుంచి తిరిగివచ్చి పల్లకీ పెళ్ళివారి పందిట్లో ఆగింది. సమయానికి చేతిలో వున్న బాకా సవరించి దూదేకుల సాయబు ఆకాశంపైకెత్తిపట్టేస్తున్నాడు. నిద్రపోతూన్న పిల్లలు హడిలిపడి లేచి ఏకగ్రీవంగా ఏడవడం మొదలుపెట్టారు. బాండువాళ్ళు

అప్పుడే 'సునోసునో' పాడి ఆపారు. సుముహూర్తానికి వెళ్లాం. లోపలికి వెళ్లే హాలులో మేజువాణీ జరుగుతోంది. నా వయస్సు వాళ్ళంతా ఆ ప్రాంతంలోనే సర్దుకుంటున్నారు.

"రావోయి శర్మా! ఇటుఇటు' అని అందులోంచి ఒక ఆప్తబంధువు పిలిచాడు. "శర్మ ఫాక్తు ఏంటీనాచ్ – పిలవకురా బాబూ" అని ఒకడు.

సుమారు పదేళ్ళయింది బోగంమేళంలో కూచుని. పాపం – ఈ కళావతుల్లో కళ ఏనాడో పోయింది. అక్కడికి వెళ్ళి ఏం బావుకోవాలి. పౌడర్లు, రంగుచీరలు, సిల్కు రవికలు కప్పిన రోగిష్ఠి శరీరాలను చూచి చప్పరించడం తప్ప. అథవా – ఒకసారి వెళ్ళి కూచున్నా 'ఈ దేహం అమ్మకానికి – వలయువారు...." అన్నవేవో జ్ఞాపకం వచ్చి కళ్ళనీళ్ళ పర్యంతం అవుతుంది నాకు. టైలర్లు, డ్రైవర్లు, హోటలు సెర్వర్లు గదా ఈనాటి రసికులు. అణాకానీకి దిగలాగి 'ఈతపళ్ళ' పాటలు పాడించి నిర్భాగ్యులంతా యీమధురమైన సంస్థను చంపేశారు.

తలవంచుకొని లోపలికి నడిచాను. ఓహో – ఏమి నేత్రనిర్వాణం. విశాలమైన ప్రాంగణంలో బాగా అలంకరించిన వివాహ మండపం!

కుడివైపున నాగరిక వేషంతో కూచుని అత్తరు పన్నీరూ, తాంబూలాలూ, విరివిగా ఉపయోగిస్తున్న లౌక్యులు. బంధుకోటీ, పెళ్ళిపీటకు ఎదురుగుండా, ఒక బ్రాహ్మణ సముద్రం. విసనకర్ర మేఘాలు దానిమీద అతిజోరుగా ఆడుతున్నాయి. పూచిన తంగేడు పొదల్లా స్త్రీజనం యొక్క నల్లని జడలూ, తెల్లని మల్లెచెండ్లూ ఆ ప్రాంతాన్ని ఏలుతున్నాయి.

ఈపేట స్త్రీల పద్ధతే వేరు –

రాచ్చిప్పల్లో, మడిబట్టల్లో కొట్టుకునే బ్రాహ్మణ కుటుంబాలలో తప్పబుట్టారు. ఎంత ఉత్సాహంగా చురుగ్గా కళకళలాడుతూ ఉంటారనీ! ముప్పై నలభై ఏళ్ళ ఆవిడ కూడా చీరారవికా ఎక్కడా మాయనీయకుండా, కడిగిన ముత్యంలా తయారై బయటకు వస్తుంది. కనుకనే ఆ ఊళ్ళో ఏ శుభకార్యానికి పిలిచినా మహా సరదా అవుతుంది వెళ్ళడానికి.

నేను ఒకచోట చదికిలబడ్డాను. బ్రాహ్మణోత్తములు అర్థం తెలియని వేద మంత్రాలతో హోరుపెడుతున్నారు.

"మదర్థంకన్యాం వృణీధ్వమ్" – పెండ్లికుమారుడు మొహం ఎరగని ఒక బ్రాహ్మణ్ణి పిలిచి పావలా చేతిలోపెట్టి నాకో పెళ్ళికూతుర్ని చూసిపెట్టమన్నాడు. బ్రాహ్మడు అక్షతలు దులిపి డబ్బులు రొంటినిదోపి లేచినచోటే కూచున్నాడు. అట్లానలుగురు. పాపం ఒక్కరూ ఆ అబ్బాయి మాట వినలేదు. డబ్బుతిని దగా చేశారు.

ఆ ఇంటి 'యజమాని' మంచివాడు గనుక అతనిమీద దయగలిగి, పట్టుబట్టలు

కట్టుకువచ్చి అతనికెదురుగా కూచుని మా పిల్లను నీకిస్తామన్నాడు.

"కన్యాం కనకసంపన్నాం కనకాభరణై ర్యుతాం దాస్యామివిష్ణవే తుభ్యం..." అన్నీ అబద్ధాలు పిల్ల ఒంటిమీద ఒక్క నగ కూడా కనపడ్డం లేదు. జడలో నాగమల్లి పువ్వులు తప్ప - వెయ్యి నూటపదహార్లు రూపాయలు మగపెళ్ళివారు కట్నంగా గుంజిన తర్వాత నగలు పెట్టవలసిన పూచీ ఆయనకేముంది?

"ధర్మార్థ కామేషు త్వ యైషా నాతిచరితవ్యా" కన్యాదాత అన్నాడు - మహా అర్థం తెలిసినట్టు "నాతిచరామి" సంస్కృతం ముక్కలు నోటపట్టని అబ్బాయిచేత పురోహితు దనిపించాడు.

సభలో కూచున్న వృద్ధులూ, ముదిఐదువలూసాదరంగా స్పృశించిన మీదట - మంగళసూత్రం చేత్తో పట్టుకుని పెండ్లికొడుకు

"మాంగల్యం తంతునా నేన మమ జీవన హేతునా

కంఠేబధ్నామిసుభగే...."

అంటూ, తెల్లని కళ్ళతో చూసి అమాయకంగా మెడ ఒప్పగించే పెళ్ళికూతురు మెళ్ళో కట్టాడు. ముడిపడింది -

నా కళ్ళలో ఎందుకో నీళ్ళు తిరిగాయి. అబ్బ - ఎంత తియ్యని ముడి! ఎన్నాళ్ళకూ విడరాని ముడి! సుఖదుఃఖాల్లో - నవ్వు ఏడుపుల్లో నులివెచ్చని కౌగిలింతల్లో - ఒకరివెంట ఒకర్ని బలంగా లాగే ముడి! దీని బాధ్యత దీనిలోని అనంతమాధుర్యం ఈపూపపిందెలకేం తెలుసు?

తెలిస్తే - వెంటనే - నును కొత్తసిగ్గుతో ఒకరినొకరు చూసుకొని, ఎంత హాయిగా - తీయగా నవ్వుకొనేవారు!

మనస్సులో సముద్రపుటలల్లా ఎన్నో ఊహలు. ఈ గ్రంధి - చేతులకూ మెడకూనా? - ఛా! ఎంత విరూపఘటన! రెండు పక్వ హృదయాలలోను స్నేహతంతువుల ముడి - ఎప్పుడో - ఎక్కడో - ఋషుల ఆశీర్వచనాలతో పుట్టిన పవిత్ర వివాహ సంస్థ తుదకెట్లా తేలింది? నిద్ర కూరుకువస్తోంది. లేచి విడిది మేడవైపు నడిచాను. మేడమీద దీపాలు లేవు, హాల్లో యిద్దరు చంటిపిల్లలుగావును నిద్దరపోతున్నారు.

తడుముకుంటూ గదిలోకి వెళ్ళాను. బట్టలు మార్చే ఓపిక లేదు. పరుపుకోసం వెదికాను, నిద్రమత్తులో తూలుతూ. పరుపు చక్కగా పరిచి వుంది.

అప్పుడే వచ్చి శయనించింది గాబోలు మా ఆవిడ. మొగాళ్ళకన్న ఓర్మిబద్ధకం మనిషి - పిల్లలతో తగువుపడుతూ ఎక్కడో కూచుని చక్కా వచ్చి వుంటుంది.

పరుపుమీద ఒరిగాను. పెళ్ళివారు రాసిన దిల్‌బహార్ సెంటుతో నా లాల్చీ పరిమళి స్తోంది. తీరా పడుకుంటే ... నిద్ర రాదు. దొర్లుతున్నాను.

పెండ్లివారింట్లోంచి చల్లగా ఇంకా పెళ్ళి మంత్రాలు వినబడుతున్నాయి.

"సోమఃప్రథమో వివిదే గంధర్వో వివిదఉత్తరః" నాకు నవ్వొచ్చింది. రెండు నిమిషాలు గడిచాయి. మెత్తని తామరతూడు వంటి చెయ్యొకటి నా మెడమీద పడింది. బంగారు గాజులు చిరుతచప్పుడు చేశాయి, ఆ మృదుస్పర్శకు నా నరాలన్నీ భగ్గుమని వెలిగాయి. శరీరం జరుగుతోంది. మెదడు తిరగబడుతోంది. ఎంత విచిత్రమైన అనుభవం.

పెళ్ళిపచ్చకర్పూరపు తాంబూలంతో పరిమళించే వెచ్చని నాలుగు పెదవులూ, ఉద్రేకంగా కొట్టుకునే రెండు హృదయాలూ అతిదగ్గరగా కలుసుకున్నాయి.

పెళ్ళి మంత్రాలు ఇంకా వినబడుతున్నాయి.

"సఖాసప్తపదా భవ సఖాయౌ....

సఖ్యాత్తే మాయోషగ్ం సఖ్యాన్మేమాయోష్ఠాః"

నేను బయలుదేరిన చోటునుండి తోవతప్పి ఏ గంధర్వ లోకంలోని దేవకన్యక ఒడిలోనో పడలేదుకదా!

ఆ బాహునాళపు సుఖస్పర్శ – పెదవులు కదిపే నేర్పు – ఏ జన్మలోనూ పరిచితమైనట్టు లేదు. ఆ మత్తులోంచి లేచి ఆలోచించే త్రాణలేక బుద్ధిగిలగిలా కొట్టుకుంటోంది.

హఠాత్తుగా తెల్ల గులాబీ తలనూనె తీవ్ర పరిమళంతో నా తల తిరిగింది.

(1942 జులై - భారతి)